సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



పక్కా రోడ్లతో పల్లెల ప్రగతి
పక్కారోడ్లతో పల్లెల ప్రగతి సాధ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. 8లో



స్ఫూర్తి ప్రదాత వివేకానంద
స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత అని, సెట్విజ్ ఉమ్మడి విశాఖ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. 8లో



వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు
బీజేపీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. 9లో

న్యూస్‌రీల్

జాబ్‌మేళాలో 16 మంది ఎంపిక

రంపచోడవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరం యూత్ ట్రెనింగ్ సెంటర్ (వైటీసీ)లో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. అపోలో టైర్స్, డిమార్ట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 41 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా 16 మంది ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సం్థ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్లు, ప్లేస్ మెంట్ ఎగ్జిక్యూటివ్ సతీష్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై దాడులు

● రూ.25 వేల జరిమానా

రాజవొమ్మంగి: మండలంలో విద్యుత్ చౌర్యంపై విజిలెన్సు అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. రూ. 25వేల అపరాధ రుసుం విధించారు. కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాల వద్ద సంబంధిత కాంట్రాక్టర్లు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

అటవీ చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో ఫారెస్టు రేంజ్ అధికారి దుర్గాకుమార్‌బాబు

దేవీపట్నం: జిల్లాల పునర్విభజన అనంతరం మండలంలోని ఇందుకూరు అటవీశాఖ రేంజ్ పరిధిలో శరభవరం బీట్ ఉప్పయ్యపాలెం వద్ద అటవీశాఖ తాత్కాలిక చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఇందుకూరు అటవీక్షేత్రాధికారి దుర్గాకుమార్‌బాబు తెలిపారు. జిల్లాల విభజన అనంతరం మైదానప్రాంతమైన గోకవరం, బూరుగుపూడిలో గల అటవీశాఖ చెక్‌పోస్టులు రాజమహేంద్రవరం రేంజ్ పరిధిలోకి చేరాయి. దీంతో ఇందుకూరు రేంజ్ అటవీ రక్షణ చర్యల్లో భాగంగా ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదానప్రాంతానికి అక్రమ కలప రవాణా అరికట్టే లక్ష్యంతో శుక్రవారం తాత్కాలిక చెక్ పోస్టు ఏర్పాటుచేసినట్టు ఆయన వివరించారు. ఇందుకూరు రేంజ్ పరిధిలో సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్లు, ఏబీవోలు పాల్గొన్నారు.

టపాసు పేలి బాలుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రిషివర్ధన్

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత గ్రామానికి చెందిన బాలుడు జుర్రా రిషి వర్ధన్ దీపావళి టపాసు పేలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం తోటి పిల్లలతో ఆడుకుంటూ చిచ్చుబుడ్డిని వెలిగించాడు. ఒక్కసారిగా రవ్వలు ఎగసిపడటంతో రిషివర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు స్థానికులు తెలిపారు. రిషివర్ధన్ అదే గ్రామంలో మూడవ తరగతి చదువుతున్నాడు. తండ్రి రాజుబాబు, తల్లి వెంకటలక్ష్మికి కూలిపనులే జీవనాధారం.

పిడుగుపాటుకు పశువుల మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ బెల్లంగరువు గ్రామంలో శుక్రవారం ఉరుములు,మెరుపులు, పిడుగులతో పాటు భారీ వర్షం కురిసింది. బెల్లంగరువు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేస్తున్న పశువుల్లో మూడు ఇదే ప్రాంతంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామంలో గిరిజన రైతు మర్రి భాస్కరరావుకు చెందినవిగా స్థానికులు తెలిపారు. మృతి చెందిన పశువుల విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు భాస్కరరావు కోరారు.

అంతర్రాష్ట్ర రహదారికి మోక్షం

దశాబ్దాల తరబడి అధ్వానంగా ఉన్న అంతర్రాష్ట్ర (సీలేరు) రహదారికి ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. గత పాలకులు నిర్లక్ష్యం చేసిన ఈ రహదారిని పూర్తిస్థాయిలో మెరుగుపరచాలన్న లక్ష్యంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టడంతో సమస్య పరిష్కారం అవుతుందన్న ఆశలు అందరిలోను చిగురిస్తున్నాయి.

- ఇప్పటికే 40 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి
- మిగతా పది కిలోమీటర్లకు నిధులు కేటాయిస్తామన్న కలెక్టర్ సుమిత్‌కుమార్
- ప్రతిపాదనలు పంపాలని ఉపాధి హామీ, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశం



చురుగ్గా జరుగుతున్న రోడ్డు పనులు



ఇటీవల రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గూడెంకొత్తవీధి: అల్లూరి సీతారామరాజు జిల్లాగా ఆవిర్భవించిన తరువాత చింతపల్లి (వయా సీలేరు) భద్రాచలం రహదారికి ప్రాధాన్యం పెరిగింది. తెలంగాణకు వెళ్లాలన్నా, జిల్లాలో కీలకమైన రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రంపచోడవరం వెళ్లాలన్నా ఈ మార్గమే ఆధారం. ఇంతటి ప్రాధాన్యమున్న ఈరోడ్డును గత పాలకులు పూర్తిగా విస్మరించారు. అడుగడుగునా గోతుల వల్ల ప్రయాణికులకు నరకం చూడాల్సిందే. ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి మరింత దయనీయం. వర్షం కురిస్తే కొండ వాగుల నీరంతా రోడ్డుపైకి వచ్చేసి కోతకు గురిచేస్తోంది. దాదాపుగా పదేళ్లుగా ఇదే పరిస్థితి. ఈ మార్గంలో చింతపల్లి నుంచి ఆర్‌వీ నగర్ వరకు రోడ్డు బాగుంటుంది. అక్కడి నుంచి నూతిబంద వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది.

50 కిలోమీటర్ల రహదారిలో..

గూడెంకొత్తవీధి నుంచి సీలేరు వరకు 50 కిలోమీటర్లు కాగా ఈ మార్గంలో ఇప్పటివరకు రెయిన్ గేజ్ ప్రాంతం ఉంచి సీలేరు పవర్ ప్రాజెక్ట్ వరకు సుమారు 30కిలోమీటర్ల పొడవు రోడ్డును రూ.15.40 కోట్లతో పక్కాగా అభివృద్ధి చేశారు. రెయిన్ గేజ్ నుంచి ఇవతల వైపు 10 కిలోమీటర్ల పొడవు రోడ్డును రూ.4.31 కోట్లతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మిగిలిన గూడెంకొత్తవీధి నుంచి నూతిబంద వరకు 10 కిలోమీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణానికి నిధులకొరత ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డును చూస్తే ప్రయాణికులు బెంబేలెత్తి పోతున్నారు. ద్విచక్రవాహనాలైతే ఏమాత్రం ఏమరుపాటుగా నడిపినా ప్రమాదానికి గురికాక తప్పని పరిస్థితి. ఈ కారణంగానే అంత రాష్ట్రాలకు వెళ్లే హైదరాబాద్, మల్కన్‌గిరి, భద్రాచలం ఆర్టీసీ బస్సులు తరచూ నిలిచిపోతున్నాయి.

కలెక్టర్ దృష్టికి సమస్య

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సీలేరులో పర్యటించిన పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి దృష్టికి సమస్యను స్థానికులు తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. ఈ నేపథ్యంలో ఆయన కొద్దిరోజుల క్రితం గూడెంకొత్తవీధి–నూతిబంద మధ్య రోడ్డు దుస్థితిని ఆయన పరిశీలించారు.

నిధుల మంజూరుకు చర్యలు

సుమారు 10 కిలోమీటర్ల రోడ్డుకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం, రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపింతే వెనువెంటనే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఆయన ఆదేశించారు. పది కిలోమీటర్ల రోడ్డును ఎలాగైనా పూర్తిచేయాలన్న లక్ష్యంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా ఉన్నందున సమస్య పరిష్కారమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

16న విశాఖకు సీఎం జగన్

ఇన్ఫోసిస్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఇన్ఫోసిస్ ప్రతినిధులు

దొండపర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వచ్చేనెల 16న విశాఖకు రానున్నారు. ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ్ అమర్‌నాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో ప్రభుత్వ అతిథి గృహంలో సమీక్షించారు. ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ఈ సమీక్షలో ఇన్ఫోసిస్ మౌలిక సదుపాయాల విభాగ ప్రాంతీయ అధికారి కులకర్ణి, ఇండియా హెడ్ పునీత్ దేశాయ్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

297 వైద్య శిబిరాల నిర్వహణకు ప్రణాళిక

- 165 మంది వైద్య నిపుణులతో సేవలు
- రోజుకు 10 నుంచి 12 ఏర్పాటు
- సీఎం వీడియో కాన్ఫరెన్సులో వెల్లడించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం: జిల్లాలో 297 వైద్య శిబిరాలను వైద్యనిపుణులతో నిర్వహించేందుకు ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జగనన్న సురక్ష అమలుపై శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ తాడేపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని పరిస్థితులను సీఎంకు వివరించారు. నిర్వహించనున్న జగనన్న సురక్ష శిబిరాల్లో 165 మంది ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొంటున్నట్టు ఆయన వివరించారు. ప్రతి మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేశామని, ప్రతిరోజు 10 నుంచి 12 వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నవంబర్ వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. గర్భిణులు, పోషకాహారం లోపంతో బాధపడే చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టి వైద్య సేవలు అందిస్తామన్నారు. పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్షాపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యాధుల నివారణకు అవసరమైన వైద్య సేవలు అందస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలతా దేవి, డీసీహెచ్‌ఎస్ డా. కృష్ణారావు, జిల్లా క్షయ నివారణాధికారి డా. టి. విశ్వేశ్వరరావు తదితరు అధికారులు పాల్గొన్నారు.

3,353 మందికి రూ.3.35 కోట్ల లబ్ధి



వాహనమిత్ర లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మోటార్ కార్మికులతో సీఎం జగన్ ఫొటోకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

- వైఎస్సార్ వాహన మిత్ర సాయం జమ చేసిన సీఎం జగన్
- సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సూచన

సాక్షి, పాడేరు: వైఎస్సార్ వాహన మిత్ర పథకంలో జిల్లాలో 3353 మంది లబ్ధిదారులకు రూ.3కోట్ల 35 లక్షల 30 వేల మేర ప్రయోజనం చేకూరింది. విజయవాడ నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఐదవ విడత వాహనమిత్ర ఆర్థిక సాయం విడుదల కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వాహన మిత్ర లబ్ధిదారులు తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం జమ చేసిన వైఎస్సార్ వాహనమిత్ర పథకం ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాదయాత్రలో డ్రైవర్ల వినతి మేరకు వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయరంగాలతో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సమూనా చెక్కును ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, జిల్లా రవాణా అధికారి ఎల్.లీలా ప్రసాద్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.వాసు, పరిపాలనాధికారి జి.శ్యాంప్రభు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: వాహన మిత్ర పథకం డ్రైవర్లకు మరింత భరోసా కలుగుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. యండపల్లివలస రైల్వేస్టేషన్ స్టాండ్ వద్ద శుక్రవారం మోటార్ యూనియన్ ప్రతినిధులు ఎమ్మెల్యే అధ్యక్షతన సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీపీ ఉషారాణి, జిల్లాకమిటీ సభ్యుడు గాసి, మోటర్ యూనియన్ అధ్యక్షుడు నాగర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి అస్వస్థత

- తక్షణ వైద్యం అందించడంతో తప్పిన ప్రాణాపాయం

గంగవరం : మండలంలోని కొత్తాడ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యుత్ షాక్‌కు గురైన విద్యార్థినికి అత్యవసర వైద్యం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఇదే విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న కె.సఖిన శుక్రవారం గది శుభ్రం చేసే క్రమంలో ఫ్యాన్ స్విచ్ ఆపుతుండగా విద్యుత్ షాక్ తగిలి స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం గోకవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు. అక్కడ ఆమె కోలుకోవడంతో కుటుంబసభ్యులు ఇంటికి తీసుకువెళ్లిపోయారు.

అర్హులందరికీ రుణాలు

దుంబ్రిగుడ: వార్షిక రుణా ప్రణాళిక మేరకు అర్హులైన రైతులకు నూరు శాతం రుణాలు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ చెప్పారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం పర్యటించారు. బ్యాంకర్లతో ఆయన వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి కేటాయించిన రూ.1,279 కోట్లలో ఇప్పటి వరకు 40 శాతం రుణాలు మంజూరు చేశారని, వ్యవసాయ సంస్థలకు టర్మ్ కింద రూ.184 కోట్ల రూణాలకు గాను 48.69 శాతం మంజూరు చేశామన్నారు.

బధిరుల సంజ్ఞా భాష కరపత్రం ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

దుంబ్రిగుడ: జిల్లా ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన బధిరుల సంజ్ఞా భాష బ్రోచర్‌ను జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి సైగల శిక్షణను ప్రతిఒక్కరికి ఇప్పించి బధిరులను ప్రోత్సహించాలని సూచించారు. వారి అర్హతల మేరకు ప్రభుత్వం తరపున పింఛను మంజూరుకు ఉపకరణాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో ఉషారాణి పాల్గొన్నారు.

● మంచు ముత్యాలు



ఏజెన్సీలో కొద్దిరోజులుగా శీతాకాలాన్ని తలపంచేలా కురుస్తున్న మంచు తెరల మాటున ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. – సాక్షి, పాడేరు

విస్తారంగా వర్షాలు.. పొంగిన వాగులు

- జిల్లా వ్యాప్తంగా 116.6 ఎంఎం
- అత్యధికంగా దేవీపట్నంలో 34.6
- అత్యల్పంగా జి.మాడుగులలో 1.6 ఎంఎం నమోదు



కిమ్మిలిగెడ్డ మార్గంలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న కొండ వాగు

సాక్షి, పాడేరు: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం కురిసిన వర్షానికి జిల్లావ్యాప్తంగా 116.6 ఎంఎం వర్షపాతం నమోదైంది. అత్యధికంగా దేవీపట్నంలో 34.6 ఎంఎం, అత్యల్పంగా జి.మాడుగులలో 1.6 ఎంఎం వర్షపాతం నమోదైంది.

రాజవొమ్మంగి: మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. భారీ వర్షానికి కిమ్మిలిగెడ్డ, అమ్మిరేఖల తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో పెద్దేరు పొంగి ప్రవహించింది. ఆ వరద నీరు వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి చేరడంతో పొర్లుకట్టుపైనుంచి మిగులు జలాలు దిగువకు ప్రవహిస్తున్నాయి. కబర్మతి కాలువ, పులిగొమ్ము కాలువలకు వరద ఉధృతి నెలకొంది. రాజవొమ్మంగి నుంచి వయ్యేడు, బూరుగపల్లి తదతర గ్రామాలకు వెళ్లే మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఉధృతంగా తీగలమెట్ట కాలువ

కొయ్యూరు: మండలంలో శుక్రవారం కురిసిన తీగలమెట్ట గెడ్డ ఉధృతంగా ప్రవహించింది. రామరాజుపాలెం వద్ద రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాజ్‌వే మీదుగా ప్రవహించడంతో సుమారు 3 గంటల పాటు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి.

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కుండపోతవర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రింతాడలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులు పాక్షికంగా దెబ్బతిన్నాయి.



రామరాజుపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తీగలమెట్ట కాలువ

ప్రజల చెంతకు సేవలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



వినతులను నమోదు చేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

- జగనన్న చెబుదాంలో వినతులు స్వీకరించిన అధికారులు
- మారుమూల గ్రామాల నుంచి తరలివచ్చిన గిరిజనులు
- 337 అర్జీలు అందజేత

దుంబ్రిగుడ: ప్రజల చెంతకు అధికారులు వచ్చి అర్జీలు స్వీకరించడంతో మారుమూల గ్రామాల గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అధ్యతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల నుంచి 337 వినతులు స్వీకరించారు. అధిక శాతం సామాజిక సమస్యలకు సంబంధించిన అర్జీలు వచచినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఈ సందర్భంత పీవో మాట్లాడుతూ ప్రజలకు సేవలు మరింత చేరవ చేయాలన్న లక్ష్యంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, జిల్లా,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- మండలంలోని పోతంగి పంచాయతీ చంపపట్టి, చెలిమరవలస, చాపరాయి సమీపంలో బ్రిడ్జిలు నిర్మించాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరారు.
- కొర్రాయి పంచాయతీ మార్గంలో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని మండల వైస్ ఎంపీపీ లలిత, గ్రామస్తులు పీవోకు విన్నవించారు.
- భూ సమస్యలు పరిష్కరించాలని పలు గ్రామాల నుంచి అర్జీలు అందాయి.
- దుంబ్రిగుడ నుంచి పీహెచ్‌సీను గుంటసీమకు తరలించాలని వినతి పత్రం ఇచ్చారు.

అవస్థలు తప్పాయి



భూ సమస్యలను అధికారులకు నేరుగా చెప్పుకునేందుకు అవకాశం ఏర్పడింది. అధికారులు మండల కేంద్రానికి రావడం వల్ల పాడేరు వెళ్లాల్సిన అవస్థలు తప్పాయి. ఎప్పుడూ ఇలాగే నిర్వహించాలి.
– సమర్థి జమున, గిరి మహిళ

రేషన్‌కార్డు కోసం దరఖాస్తు



రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకున్నా. గతంలో అయితే పాడేరు వెళ్లాల్సి వచ్చేది. అధికారులు ఇప్పుడు తమ వద్దకే వచ్చారు. ఈ విధానం చాలా బాగుంది. ఎప్పుడూ ఇలాగే వస్తే మా కష్టాలు తప్పినట్టే.
– కె.కమల, గిరి మహిళ

క్లుప్తంగా

చికిత్స పొందుతూ గిరిజన మహిళ మృతి


లోవమ్మ మృతదేహం

రాజవొమ్మంగి: ఆత్మహత్యకు యత్నించిన గిరి మహిళ కాకినాడు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు. ఆయన కథనం మేరకు .. వంచంగి గ్రామానికి చెందిన జర్తా లోవమ్మ (40) ఈనెల 26న పొలంలోకి వెళ్లింది. అక్కడ మేకలకు కాపాలాగా ఉన్న భర్త వీరభద్రరావు మద్యం మత్తులో కనిపించాడు. దీంతో విరక్తి చెందిన ఆమె ఆగ్రహానికి గురై ఇంటికి తిరిగి వచ్చేసింది. భర్తను భయపించి తాగుడు మాన్పించాలన్న ఉద్దేశంతో ఇంట్లో ఉన్న పురుగుమందును కొద్దిగా సేవించింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను వెంటనే ఏలేశ్వరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్య శాస్త్రం, వృక్ష శాస్త్రం సబ్జెక్టుల పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పోస్టును కూడా భర్తీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ కలిగి, 55 శాతం పైబడి మార్కులు సాధించినవారు తమ దరఖాస్తు, ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు ఫొటోలు, జెరాక్సు కాపీలతో అక్టోబర్ 3వ తేదీ ఉదయం 11 గంటలకు నేరుగా కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టులలో ఎంఫిల్, పీహెచ్‌డీ, నెట్, స్లెట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ మండలశాఖ

అధ్యక్షులు వీరే

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు జాబితాను విడుదల చేసింది. మండలాల వారీగా వివరాలు..


సీదరి రాంబాబు, పాడేరు


జల్లి బాబులు, కొయ్యూరు


ఎం.రవి, చింతపల్లి


పాంగి మల్లికార్జునరావు, ముంచంగిపుట్టు


వంతాల ఆనందరావు, పెదబయలు


లోకోయి లక్ష్మణకుమార్, అరకులోయ


గెమ్మెలి కొండబాబు, హుకుంపేట


చిక్కుడు మల్లేశ్, డుంబ్రిగుడ


రేగబొయిన స్వామి, అనంతగిరి


జల్లిపల్లి రామన్నదొర, రంపచోడవరం


యగమంటి రామలింగారెడ్డి, చింతూరు


సత్తి సత్యనారాయణరెడ్డి, మారేడుమిల్లి


సింగిరెడ్డి రామకృష్ణ, రాజవొమ్మంగి


అప్పలరాజు, గంగవరం


మద్దాల వీర్రాజు, అడ్డతీగల


మాదిరెడ్డి సత్యనారాయణ, వి.ఆర్.పురం


తానికొండ శ్రీనివాసరావు ఎటపాక


బెబ్బులి లక్ష్మణ్, జీ.కె.వీధి


గారపాటి మురళీకృష్ణ, దేవీపట్నం


మత్స్యకొండంనాయుడు, జి.మాడుగుల


మామిడి అప్పారావు, వై.రామవరం


అలూరి కోటేశ్వరరావు, కూనవరం

పక్కా రోడ్లతో పల్లెల ప్రగతి

ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: పల్లెల్లో పక్కా రోడ్లు ప్రగతికి సోపానాలు వంటివని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. మండలంలో వారు శుక్రవారం పర్యటించారు. పలుచోట్ల నిర్మించనున్న రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. తొలిత మట్లపాడు–గొరగొమ్మి గ్రామాల మధ్య రూ.4 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు, మట్లపాడు–కొత్తపాలెం మధ్య రూ.1.50 కోట్లు వ్యయంతో నిర్మించనున్న పనులకు, గొంటువానిపాలెంలో రూ.7 లక్షలు జెడ్పీ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు, కిమ్మూరు–సరంపేటపాడు మధ్య రూ.75 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, కిమ్మూరు–పులిగోగులపాడు మధ్య రూ.1.60 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కిమ్మూరులో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణాల వల్ల రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులను రైతులు బహిరంగ మార్కెట్‌కి తరలించి విక్రయించుకొని, గిట్టుబాటు ధర పొందవచ్చన్నారు. రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కారు రాంబాబు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతోనే అధిక దిగుబడి

- స్పైసెస్ బోర్డు డైరెక్టర్ ధర్మేంద్ర దాస్
- మిరియం రైతులకు సూచనలు


శిక్షణ కార్యక్రమానికి హాజరైన మోదాపల్లి మిరియం రైతులు

పాడేరు రూరల్ : మిరియాల సాగులో మేలైన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని స్పైసెస్ బోర్డు డైరెక్టర్ ధర్మేంద్ర దాస్ సూచించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మండలంలోని మోదాపల్లి గ్రామానికి చెందిన మిరియం రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్పైసెస్ బోర్డు డైరెక్టర్ వర్చువల్ విధానంలో సూచనలిచ్చారు. మిరియాల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు స్పైసెస్ బోర్డు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. టార్పాలిన్లు, అల్యూమినియం నిచ్చెనలు, మిరియాలు వలిచే యూనిట్లు, వర్మీ కంపోస్టు యూనిట్లను స్పైసెస్ బోర్డు ద్వారా అందించాలని రైతులు కోరారు. దీనిపై స్పైసెస్ బోర్డు డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కళ్యాణి, సబ్జెక్టు నిపుణులు జంగయ్య, మోదాపల్లి సర్పంచ్ కె. మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద


హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు


విద్యార్థుల నృత్యాలు

ఉమ్మడి విశాఖ సెట్విజ్ మేనేజర్ సత్యనారాయణ

సాక్షి,పాడేరు: స్వామి వివేకానందుడు యువతకు స్ఫూర్తి ప్రదాతన అని, ఆయన దేశభక్తిని యువత ఆదర్శంగా తీసుకుని సమాజహితంగా ఉన్నత స్థానానికి ఎదగాలని, సెట్విజ్ ఉమ్మడి విశాఖ మేనేజర్ కె.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి, యువకులు ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేయవద్దని, ప్రతి పనిని ఇష్టంతో నేర్చుకుంటే ఆయా రంగాల్లో విజయం సాధించవచ్చన్నారు. అనంతరం డిగ్రీ కళాశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యరూప పోటీలు నిర్వహించారు. దేశభక్తితో పాటు గిరిజన ఆచార, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా జరిగిన పోటీలు ఆకట్టుకున్నాయి. జానపద గేయాలు, డ్యాన్స్‌లు పోటీలు అలరించాయి. ఇందులో భాగంగా స్టోరీ రైటింగ్, ఫోటోగ్రఫీ, పోస్టల్ మేకింగ్, చేతివృత్తుల పోటీలను నిర్వహించారు. విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. పాడేరు, చింతపల్లి, పలు డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ వనుము చిట్టబ్బాయి, డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, పి.చలపతిరావు, పారయ్య,ఎ న్ఎస్ఎస్ పీవోలు జి.గౌరిశంకరరావు, అనిత ,రమేష్‌బాబు, సీనియర్ అధ్యాపకులు మురళీధరరావు, చంద్రకళ, కోటేశ్వరరావు, అశ్వినిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఆవరణలో జనఔషధ కేంద్రం

- డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పల్లా నర్సింగరావు

అనకాపల్లి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్థానిక డీసీఎంఎస్ ఆవరణలో జనఔషధ కేంద్రాన్ని ప్రారంభిస్తామని డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు తెలిపారు. స్థానిక జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లిమిటెడ్ ఆవరణలో శుక్రవారం జరిగిన 49వ మహాజనసభలో ఆయన మాట్లాడారు. తర్వలో జనఔషధ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు చెప్పారు. సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్‌కు పోలీసుల అనుమతులు తప్ప, అన్నిశాఖల అనుమతులు లభించాయని చెప్పారు. పట్టణంలో బండిగాడివీధిలో ఉన్న సంస్థ స్థలంలో గొడౌన్ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు ఆయన చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జమాఖర్చులను ఆమోదించినట్టు తెలిపారు. సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. అంతకుముందు సంస్థ వ్యవస్థాపకుడు బొడ్డేడ అచ్చియ్యనాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళులర్పిస్తూ సభ్యులు కొంతసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ మేనేజర్ ఐ.వి.రమణమూర్తి, సభ్యులు పాడ్రంగి అప్పారావు, బంగారి అప్పలనర్సమ్మ, పిళ్లా దాశరథి నర్సింహరావు(గాంధీ), నందాల సుబ్రయ్య, గుమ్ముడు సత్యదేవ్ పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవలు పునః ప్రారంభం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఈ నెల 24 నుంచి 28 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసిన విషయం తెలిసిందే. పవిత్రోత్సవాలు ముగియడంతో తిరిగి ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శుక్రవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్త శత నామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

నవంబరులోగా 30 లేగదూడల ప్రదర్శనలు

- ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహన్‌రావు


పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నాతవరం: ఉమ్మడి జిల్లాలో 20పైగా లేగదూడల ప్రదర్శనలు నిర్వహించి రైతులకు ప్రోత్సాహకాలు అందించామని, నవంబరులోగా మరో 30 ప్రదర్శనలు నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని గుమ్మడిగొండలో లేగదూడల ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ఉండాలన్నారు. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని కృత్రిమ గర్భధారణ ద్వారా సంకరజాతి పశువుల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆడపెయ్యిలు జన్మించేందుకు 3,500 ఇంజక్షన్ల సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇంజక్షన్ ఖరీదు రూ.1350 కాగా, ప్రభుత్వం రాయితీపై రైతుకు రూ.500కే సరఫరా చేస్తుందన్నారు. ఇంతవరకు 2,500పైగా ఇంజక్షన్లు పశువులకు చేశామని, మిగిలినవి వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేస్తామన్నారు. ఇంతవరకు ఇంజక్షన్లు చేసిన పశువులకు 45పైగా ఆడపెయ్యిలు జన్మించాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 197 మంది గోపాలమిత్రులు వీటిని వేస్తున్నారన్నారు. అనంతరం పాడి రైతులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. పశుసంవర్థక శాఖ పాయకరావుపేట ఏడీ శ్రీనివాస్, విశాఖ డైయిరీ నర్సీపట్నం పాల కేంద్రం మేనేజరు సిహెచ్. సత్యనారాయణ, గోపాలమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, పశువైద్యాధికారి బి. సంధ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల అచ్చియ్యనాయుడు, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

వహ్వా... అద్భుతం


కేంద్రమంత్రికి వేంకటేశ్వరస్వామి లక్కబొమ్మను బహుకరిస్తున్న కళాకారులు, అధికారులు

- ఏటికొప్పాక లక్కబొమ్మలు చూసి ఆశ్చర్యచకితులైన కేంద్ర రైల్వే సహాయ మంత్రి దర్శన్ జర్దోష్
- హస్తకళాకారుల నైపుణ్యానికి ఫిదా

యలమంచిలి: ఖండాంతర ఖ్యాతినార్జించిన ఏటికొప్పాక లక్కబొమ్మల హొయలు చూసి కేంద్ర రైల్వే,టెక్స్‌టైల్స్ సహాయక మంత్రి దర్శన్ విక్రమ్ మంత్రముగ్ధులయ్యారు. ప్రకృతి సహజ సిద్ధ రంగులతో హస్త కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అందమైన లక్కబొమ్మలు కేంద్ర మంత్రిని అబ్బురపరిచాయి. నమ్మశక్యంకాని విధంగా కళాఖండాలను తయారు చేసిన ఏటికొప్పాక కళాకారులు నైపుణ్యం, సృజనాత్మకత కేంద్ర మంత్రిని కట్టి పడేశాయి. అందమైన బొమ్మలను చూసిన ఆమె కళాకారులను ప్రశంసించారు. శుక్రవారం మంత్రి దర్శన్ జర్దోష్ యలమంచిలి మండలం ఏటికొప్పాకలో పర్యటించి, లక్కబొమ్మల తయారీని పరిశీలించారు. ఇక్కడి కళాకారులు సృష్టిస్తున్న కళాఖండాలు ఆకట్టుకునేలా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలించి వాటి తయారీ విధానాన్ని, వారి యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హస్తకళాకారుల కోసం విశ్వకర్మ పథకం ప్రవేశపెట్టిందని చెప్పారు. చేతివృత్తుల కళాకారులు తాము స్వయంగా వ్యాపారాలు చేసుకుని ఉపాధిపొందేలా ఈ పథకంలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తోందని తెలిపారు. యంత్ర సామగ్రిని అందించి ప్రోత్సహిస్తోందన్నారు. అంకుడు కర్ర లభించకపోడంతో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. రైల్వే స్టేషన్లు, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో హస్తకళలకు సంబంధించిన స్టాళ్లు, హోర్డింగ్‌లు, పోస్టర్లను ఏర్పాటు చేసి అంతర్జాతీయంగా ప్రోత్సహించడానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా బిల్లును లోక్‌సభ,రాజ్యసభల్లో ఇటీవల ప్రవేశపెట్టిందని, దీనివల్ల మహిళలకు చట్టసభల్లో సేవలందించేందుకు అవకాశం లభించిందని చెప్పారు. ఏటికొప్పాకలో ఎక్కువ మంది మహిళలు లక్కబొమ్మల తయారీలో శిక్షణ పొంది ఉపాధి పొందడం హర్షించే విషయమన్నారు.

ఏటికొప్పాక కళాకారులు రాష్ట్రపతి, పద్మశ్రీ, జాతీయ స్థాయిలో పురస్కారాలు పొందడం గర్వించతగ్గ విషయమని కొనియాడారు. దేశంలో ఇప్పటి వరకు ఏ కేంద్ర మంత్రి ఏటికొప్పాక లక్కబొమ్మలను సందర్శించడానికి రాలేదని తాను ప్రత్యేకంగా కళాకారుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చానని తెలిపారు. ప్రస్తుతం ఆర్టిజన్స్‌కు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మెరుగుపరచి కళాకారులకు మెరుగైన జీవనాధారం కల్పించి, కళలను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఏటికొప్పాక బొమ్మలపై మనకీబాత్‌లో ప్రధాని మూడు పర్యాయాలు మాట్లాడారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, జేసీ జాహ్నవి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి,తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు, ఏపీఎం రాణి, హస్తకళాకారుల సంఘం అధ్యక్షుడు దిమిలి రమణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం వాసు, వెలుగు అధికారులు తదితరులు పాల్గొన్నారు.